# వారం వారం హాస్యం హాస్యం

# కథ - మహర్షి

పాకీజా అందమైన అమ్మాయి. అందుకే ఆనందరావు గాఢంగా ప్రేమించాడు. ఆమె ఓ ప్రేమ పరీక్ష పెట్టి ఎవరినీ అడగకుండా తన అడ్రస్ తెలుసుకుని ఇంటికి రమ్మని ఆహ్వానించి కొన్ని క్లూలు కూడా ఇచ్చింది. పాపం ఆనందరావు అష్టకష్టాలుపడి, నలుదిశలు తిరిగి చివరకు అడ్రస్ తెలుసుకుని ఆనందంతో పొంగిపోతూ గేటు తీసుకుని మెల్లగా లోపల ప్రవేశించాడు.

లోపల ఎవరూ ఉన్న అలికిడి లేదు. చాల పెద్ద బంగళా అనుకున్నాడు. అంతలో పెద్ద శబ్దాలు వినిపిస్తున్నాయి. దగ్గరకొచ్చిన కొద్దీ అవి అడుగుల చప్పుడని గ్రహించి ఉలిక్కిపడ్డాడు. అవి ఏనుగు అడుగుల శబ్దం అనుకుని ఇంట్లో ఏనుగుల్ని పెట్టుకున్నారేమిటి అనుకుంటుండగా "ఎవరు కావాలి?" అన్న పిలుపుకు అతని నోట్లో ఇసుక వేసుకుని నమిలేసినట్టు ఫీలయ్యాడుమాట వినబడిన వైపు తిరిగి చూశాడు. అక్కడ ఓ గున్న ఏనుగులాంటి ఆమె నిలబడి ఉంది. ఆమె మాటేనా కంకరమీద రోలరు దొర్లించి నట్లున్నది అనుకుంటుండగా ఆమె మళ్ళీ అడిగింది.

ఆనందరావు పళ్ళు గర్ మని శబ్దం చేయగా దవడ పట్టుకున్నాడు.

"అదేమిటి నాయనా" అన్నది

"అది... అది... పళ్ళపోటు. పాకీజా వుందాండి" అన్నాడు కసిగా కంకర అనుకుని.

"లోపలకొచ్చి కూర్చోండి" అన్నది.

బ్రతుకు జీవుడా అనుకుని వెళ్ళి కూర్చున్నాడు. ఆమె నూటయాభై కిలోలు వుంటుంది అనుకున్నాడు. హాలులో ఖరీదైన ఫర్నీచర్ చాల బాగున్నది.

కంకర దబీమని అతనికి ఎదురుగా క్రింద కూర్చున్నది. ఆమె కూర్చున్న తీరుకు నేల అదిరింది.

"సోఫాలో కూర్చోండి" మొహమాటంగా అన్నాడు.

"వద్దులే నాయనా! అవి చాల బలహీనంగా వున్నాయి. విరిగిపోతే నాకు దెబ్బలు తగులుతాయి. పాకీజా స్నానం చేస్తున్నది. ఈ లోపల ఒక పని చెయ్యి నాయనా!" అన్నది కంకర.

కొంపదీసి ఇంటికొచ్చిన వాళ్లతో పనులు చేయించుకోరు కదా! ఈమె పాకీజా అమ్మగారు కాబోలు. తల్లి పోలిక కూతురికి రాలేదు. లేకపోతే తను చచ్చి వుండేవాడు. నవ్వాడు ఆనందరావు.

"అడిగిన తరువాత కాదనరుకదా!" అనుమానంగా అడిగింది కంకర. అడగండి" ఇబ్బందిగా చెప్పాడు.

'ఓ కథ చెప్పు నాయనా! చాల రోజుల నుండి కథలు వినక చెవులు తుప్పుపట్టాయి. నీ కథతో ఆ తుప్పు వదిలిపోవాలి. చెప్పు నాయనా!' బ్రతిమాలింది కంకర.

ఇదెక్కడి గొడవరా బాబూ! రేపు పాకీజాను పెళ్ళి చేసుకుంటే తెల్లవార్లూ కథలు చెప్పమని ప్రాణాలు తీస్తుందేమో!

"అబ్బే! నాకసలు కథలు రావు. మా నాయనమ్మ మీద ఒట్టు. కావాలంటే మయూరి వీక్లీ కొనిస్తాను చదువుకోండి" ఇబ్బందిగా నవ్వి మరీ చెప్పాడు.

"వద్దు నాయనా! ఒకళ్ళు చెబితేనే వినాలనిపిస్తుంది. చెప్పు చెప్పు చెప్పు" గారాలుపోతూ బ్రతిమాలుతున్నది కంకర.

పాకీజా స్నానం ఎంతసేపు చేస్తుందో ఏమో. ఖర్మ. త్వరగా వస్తే బాగుండును. అనుకుంటూ లోపలకు చూశాడు ఆనందరావు.

మా పాకీజా వస్తుంది. త్వరగా చెప్పు త్వరగా చెప్పు" తొందర పెట్టింది మళ్ళీ.

ఇక చెప్పక తప్పదనుకుని మొదలుపెట్టాడు ఒకసారి దగ్గి.

"అనగనగా ఒక అడవిలో ఓ కోతి ఉంది. ఒకనాడు ఆ కోతి కాలులో ముల్లు గుచ్చుకున్నది..."

"ఛ... అదేం కథ. అది నా చిన్నప్పుడే చెప్పుకునే వాళ్ళం" అన్నది. కంకర ఆనందరావు తల పట్టుకుని కూర్చున్నాడు.

"తలనొప్పిగా వుందా?" అడిగింది కంకర.

"అదే తక్కువ" కసిగా అన్నాడు ముక్కూమొహం తెలియని వాడిని పట్టుకుని ఇలా బాధించడం కన్నా ఘోరం లేదనిపించింది.

"తక్షణం తీసుకోండి ఝండుబామ్. ఝండుబామ్. ఝండుబామ్! నొప్పి హరించే బామ్ తగ్గకపోతే అమృతాంజన్ స్ట్రాంగ్ తీసుకోండి. నొప్పి మటుమాయం" ఎడ్వర్ టైజ్ మెంట్ వినిపించింది కంకర.

నొప్పేమో కాని తను మాయమైతే ఎంత బాగుంటుంది. అయినా పాకీజాతో ఆనందంగా కబుర్లు చెప్పుకుందామని వస్తే ఇలా వేయించుకుని తింటుందనుకోలేదు.

"మీకు కథలు చెప్పడం అసలురాదు. నేను



చెబుతాను వినండి" అన్నది కంకర. ఇదింకా బెటరు. రేడియో ఆన్ చేసినట్లుంటుంది అను కుని తల వూపాడు.

"అనగనగనగా ఓ రాజ్యంలో ఓ రాజు వున్నా డట."

"ఉన్నాడట అంటున్నారు మీకు తెలి యదా?" నోరు విప్పకూడదు అనుకుంటూనే అడిగేశాడు.

"అలా మధ్యలో కథ ఆపితే నాకు ఒళ్ళు మండుతుంది. చెప్పింది విను అంతే! కయ్ మన్నది కంకర.

"సరిసరి చాలా బాగున్నది. చెప్పండి చె ప్పండి" అన్నాడు కంగారుగా.

"ఆ రాజుకు ఏడుగురు కొడుకు లున్నారు..."

"ఏడుగురు వేటకెళ్ళారు అంతేనా?" టక్కున ప్రశ్నించాడు తెలిసిపోయిందన్నట్లు ఫోజు పెట్టి.

"మధ్యలో మాట్లాడవద్దన్నానా?" ఉరిమి చూసింది కంకర.

భయంగా చూశాడు. ఇబ్బందిగా ఫీల య్యాడు. తనకి తానే నిందించుకుని పాకీజాను కోపగించుకున్నాడు ఇంకా బయటకు రానందుకు.

"ఏడుగురు కొడుకులు వేటకెళ్ళి ఏడు చేపల్ని తెచ్చారు..."

"వేటకెళితే సింహాల్ని, పులుల్ని తేవాలి కానీ ... నోరు తెరవకూడదు అనుకుంటూన్నా, ధర్మ సందేహాన్ని వెలుబుచ్చకుండా వుండ లేక పోయాడు.

"చేపల్ని కాకపోతే కాకుల్ని తెస్తారు. వాళ్లేం తెస్తే మీకెందుకు? వాటిని మీరేమైనా తిం టారా? చెప్పింది వినండి. నాకసలే ఒళ్ళు మండి దంటే ఏంచేస్తానో నాకే తెలియదు" పూనకం వచ్చినట్లు వూగింది కంకర.

భయంతో వణికిపోయి సోఫాలో ఒదిగికూ ర్చుండిపోయాడు ఆనందరావు. ఇదెక్కడి గొడ వరా భగవంతుడా! అయినా ఇలాంటి వారంతా తనకే దొరుకుతారా ఏమిటి? పాకీజా కోసం తను ఎన్ని మాటలైనా పడుతాడు కానీ ఇలాంటి నరకం మాత్రం భరించలేడు. దిగులుగా చూశాడు ఆమె వైపు.

కంకర అతని ప్రమేయం లేకుండా కథ చెప్పు కుపోతున్నది. ఆమె నోటి నాగ్ధాటి రైలు పంతెన మీదగా వెళుతున్నట్లుగా వున్నది. ఆనంద రావుకు నీరసం వచ్చింది. దిగులు దిగులుగా, గుబులు గుబులుగా దిక్కులు చూస్తున్నాడు. గుర్తు కొచ్చిన దేవుళ్ళందరికీ మొక్కుతు న్నాడు.

అలుపు వచ్చి ఆపుతుందేమోనని చూ శాడు. ఆమె తొంభై మైళ్ళ వేగంతో చెప్పుకు పోతున్నది. ఈమె తనకు కాబోయే అత్తగారా? దయ్యం[illegible]ాతం, రాక్షసి, బ్రతికుండగానే మను షుల్ని పీక్కుతినే రాబందు అనుకుని సోఫాలో అలాగే వాలి పోయాడు ఆనందరావు.

అంతలో పాకీజా వచ్చింది. "ఎంతసేప యింది వచ్చి. అలా వున్నారేమిటి? ఈమె కథ చెప్పిందా?" అని ఇద్దరినీ మార్చి మార్చి చూసిం ది. కంకర తల అడ్డంగా వూపింది.

"ఈమె నాంచారి మా పని మనిషి" చె ప్పింది పాకీజా.

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. అంతసేపు పాకీజా తల్లి అనుకుని ఘోరంగా మోసపోయి లేనిపోని మర్యాద ప్రదర్శించి ఫూల్ నయ్యానే అనుకున్నాడు.

"పాపం ఆమె కథకు బాగా నీరసించి పోయారు. కొంచెం ఆగండి గ్లూకోజ్ కలిపి తీసుకొస్తాను" అంటూ లోపలికెళ్ళబోయింది. ఆనందరావు నాంచారి వైపు చూసి "ఆగండి

నేను కూడా మీతో వస్తాను. ఇక్కడే వుంటే మీరు తిరిగొచ్చేవరకూ ప్రాణాలతో వుంటానో వుండనో" అన్నాడు భయంగా.

ఆమె కిలకిలా నవ్వి "పరవాలేదు కూ ర్చోండి. నాంచారీ! లోపలికి పద" చెప్పి వెళ్ళి పోయింది.

"మళ్ళీ వచ్చినప్పుడు మిగతా కథ చెప్పక పోతే నా పేరు నాంచారి కాదు." ఓ వీరప్రతిజ్ఞ చేసి మరీ వెళ్ళిపోయింది.

బ్రతుకు జీవుడా అనుకున్నాడు ఆనంద రావు.

ఆనందరావు, పాకీజా అలా షికారుకి బయ లుదేరి ఓ పార్కులో కూర్చున్నారు.

"ఏమిటి కబుర్లు. మా ఇంటి అడ్రస్ బా గానే తెలిసింది" అన్నది పాకీజా.

"అవును మరి. అందుకు మీరు నాకు పార్టీ ఇవ్వాలి సుమా!" నవ్వుతూ అన్నాడు.

"పార్టీయే కదా! తప్పకుండా ఇస్తాను. మా నాంచారి చెప్పిన కథ నేను పూర్తి చేసి తరువాత మీకు ఏ పార్టీ కావాలంటే అది ఇస్తాను. ఏమం టారు?" అన్నది. "అంతే! ఆనందరావు పరు గు అందుకున్నాడు. ఆమె ఎంత పిలిచినా వినిపిం చుకోలేదు.

రెండు రోజుల తరువాత పాకీజా ఓ లెటరు అందుకుంది.

మాజీ ప్రేయసి!

నేను బ్రతికి వుంటే మరో పాకీజాను ప్రే మించి పెళ్ళిచేసుకుంటాను.

నా అదృష్టం బాగుండి మీ కథల గుట్టు ముందుగా తెలిసింది. మరో జన్మంటూ వుంటే అప్పుడు మీ కథలను మర్చిపోగలిగితే అప్పుడు మీ గురించి ఆలోచిస్తాను.

ఇట్లు
మీ కథల బాధితుడు
ఆనందరావు

